# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 320 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం గురువారం 24 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 320 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 24 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో కొట్లాట..

**పోలీస్ స్టేషన్‌కు చేరిన సుమలత వర్సెస్ రఘు మాస్టర్ పంచాయితీ!**

పెన్ పవర్ డెస్క్:టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో అం తర్గత వర్గ విభేదాలు ఒక్కసారిగా తీవ్ర రూపం దాల్చాయి. హైదరాబాద్ లోని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫీస్ ప్రాంగణంలోనే ఇరు వర్గాల డ్యాన్సర్లు పరస్పరం ఘర్షణకు దిగడంతో ఉద్రిక్త

- మిగతా 2లో

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

**ఎన్నికల కమిషన్‌పై ప్రియాంక గాంధీ తీవ్ర వ్యాఖ్యలు**



- ఎన్నికల రిగ్గింగ్ గురించి తెలిసి సీఈసీ అనుమతిస్తే దేశద్రోహమని వ్యాఖ్య
- ఈసీలో అవకతవకలపై వస్తున్న కథనాలు అత్యంత తీవ్రమైనవని వ్యాఖ్య
- ఈ ఘటనపై సరైన దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్

- మిగతా 2లో



## బీజేపీలో భారీ మార్పులు..

**28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు**

- ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్విండ్ భదౌరియా
- తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్
- ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి

- మిగతా 2లో

## అంబానీని వెనక్కి నెట్టిన అదానీ.. తగ్గిన ముఖేశ్ అంబానీ సంపద!

- మళ్లీ భారత్ కుబేరుడిగా గౌతమ్ అదానీ
- ముఖేశ్ అంబానీని వెనక్కి నెట్టి అగ్రస్థానం కైవసం
- వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026లో వెల్లడి
- జాబితాలో పెరిగిన మహిళా సంపన్నుల సంఖ్య
- ఏఐ, టెక్ రంగాల నుంచి కొత్త కుబేరుల వెల్లువ



పెన్ పవర్ డెస్క్:భారత సంపన్నుల జాబితాలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముఖేశ్ అంబానీని అధిగమించి, గౌతమ్ అదానీ మరోసారి దేశంలోనే అత్యంత సంపన్నుడిగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. 'వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' ఈ వివరాలను వెల్లడించింది.ఈ నివేదిక ప్రకారం, గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం సంపద 13 శాతం వృద్ధితో రూ. 9.23 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో, ముఖేశ్ అంబానీ సంపద 10 శాతం తగ్గి రూ. 8.63 లక్షల కోట్లకు పరిమితమైంది. దీంతో అదానీ సుమారు రూ. 59,400 కోట్ల ఆధిక్యంతో

- మిగతా 2లో



## తిరుమలలో వైభవంగా చక్రస్నానం..

**ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు**

- శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు నేడు చక్రస్నానం
- పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన వేలాది మంది భక్తులు
- మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
- 8 రోజుల్లో 5.76 లక్షల మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్లు తెలిపిన టీటీడీ
- సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఉత్సవాలు విజయవంతం చేశామన్న బీఆర్ నాయుడు

- మిగతా 2లో

## ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు.. సీఎం చంద్రబాబు సమీక్ష



- శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటనున్న వాయుగుండం
- ఉత్తరాంధ్ర జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల సూచన
- గంటకు 85 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం
- యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- మిగతా 2లో

## సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత

# యువతరానిదే

- అమరావతిని ప్రపంచం మెచ్చే నగరంగా తీర్చిదిద్దుతాం
- ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు 12 ఎకరాలు కేటాయింపు
- రూ.60 వేల కోట్లతో రాజధానిలో రోడ్ల నిర్మాణం
- అమరావతిలో హెల్త్‌కేర్ హబ్, క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు
- ఏఐ, డేటా సెంటర్లు, డీప్‌టెక్ రంగాలకు ప్రాధాన్యం
- ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి
- సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో యువత ముందుండాలి



**పెన్ పవర్ డెస్క్:** ప్రపంచమంతా మెచ్చే నగరంగా అమరావతి మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఫౌండేషన్ కార్యక్రమంలో సీఎం పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రాజధానిలో నిర్మించే ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలని ఆకాంక్షించారు. ఈ ఇనిస్టిట్యూట్‌కి 12 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు."అమరావతికి అనేక ఉన్నత విద్యాసంస్థలు వచ్చాయి.. వస్తున్నాయి. రూ. 60వేల కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నాం. రాజధానికి స్పోర్ట్స్ సిటీ, విమానాశ్రయం వస్తాయి. అమరావతి హెల్త్ కేర్ హబ్‌గా మారుతుంది. క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్.. గేమ్ ఛేంజర్స్ అవుతాయి. ప్రపంచంలో ఆరు దేశాల్లోనే క్వాంటమ్ ఉంది.. అమరావతికీ వస్తుంది. 21 కంపెనీలు స్టార్టప్‌లతో ముందుకొచ్చాయి. ఏఐ, డేటా

- మిగతా 2లో

## రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు: చంద్రబాబు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు ఎస్ఈసీ ఎప్పుడు షెడ్యూల్ ప్రకటించినా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఇన్‌ఛార్జ్ మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని వచ్చే బాధ్యతను ఇన్‌ఛార్జి మంత్రులు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేబినెట్ భేటీ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రులకు ఎలక్షన్

- మిగతా 2లో



## ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

## ఏపీ క్యాబినెట్ నిర్ణయాలు

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం
- రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి
- మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ.22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

**జగన్ పై మంత్రి ఫైర్**

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో

- మిగతా 2లో

## టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!



- టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 51 మందిపై రౌడీ షీట్లు
- వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెల్ల అప్పిరెడ్డి, నేత దేవినేని అవినాష్ పేర్లు
- 2021 అక్టోబర్‌లో జరిగిన ఘటనపై ప్రస్తుత ప్రభుత్వంలో సీఐడీ విచారణ
- ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో 9 పోలీస్ స్టేషన్లలో షీట్ల నమోదు
- చంద్రబాబు నివాసంపై దాడి కేసును కూడా సీఐడీకి అప్పగించిన ప్రభుత్వం

- మిగతా 2లో

## చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు

- విశాఖ వైసీపీ నేతలతో సమావేశమైన జగన్
- కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా భూములు పంచుకుంటున్నారని ఆరోపణ
- ప్రతి గ్రామంలో మంద్యం, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని మండిపాటు



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ ఈరోజు విశాఖపట్నానికి చెందిన పార్టీ నేతలతో తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.రాష్ట్రంలో రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలియదు కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములను కేటాయిస్తున్నారని విమర్శించారు. గీతం యూనివర్సిటీ పేరుతో 55 ఎకరాల భూమిని కేటాయించారంటే

- మిగతా 2లో




## న్యూక్లియర్ ఫ్యూజన్ లో భారత్ ముందడుగు

న్యూక్లియర్ ఫ్యూజన్ ఎనర్జీ రంగంలో భారత్ మరో మైలురాయిని అధిగమించింది. సూర్యుడి కేంద్రం కన్నా 20 రెట్ల వేడి ప్లాస్మాను సృష్టించారు. గుజరాత్‌లోని ప్లాస్మా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐపీఆర్)కు చెందిన ఆదిత్య-1 టోకామాక్‌పై కొత్త శక్తివంతమైన గైరో ట్రాన్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించారు. ఇది 82.6 గిగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ, 400 కిలోవాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. టోకామాక్‌లోని అత్యంత వేడి ప్లాస్మాను మరింత వేడి చేయడానికి ఈ కొత్త పరికరం ఉపయోగపడుతుంది.స్టడీ స్టేట్ సూపర్‌కండక్టింగ్ టోకామాక్ అనే పరికరం, నియంత్రిత పద్ధతుల్లో సూర్యుడిపై జరిగే న్యూక్లియర్ ఫ్యూజన్ ప్రక్రియను నిర్వహిస్తుంది. టోకామాక్‌లోని బలమైన అయస్కాంత క్షేత్రం ప్లాస్మాను నియంత్రిస్తుంది. తాజా పరిశోధనల్లో ప్లాస్మా ఉష్ణోగ్రత 20 కోట్ల డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా చేరింది. ఇది సూర్యుడి కేంద్రంలో ఉత్పత్తి అవుతున్న వేడి కన్నా దాదాపు 10-20 రెట్లు ఎక్కువ.గైరో ట్రాన్ అనేది అధిక ఫ్రీక్వెన్సీ మైక్రోవేవ్ శక్తిని ఉత్పత్తి చేసే ప్రత్యేక పరికరం. ఈ శక్తిని టోకామాక్‌లోని ప్లాస్మాలోకి పంపించడం ద్వారా దాని ఉష్ణోగ్రతను మరింత పెంచుతారు. ఆదిత్య-1లో ఇంతకుముందు 42 గిగాహెర్ట్జ్ జైరోట్రాన్ వ్యవస్థను ఉపయోగించారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన 82.6 గిగాహెర్ట్జ్ వ్యవస్థ అధిక సామర్థ్యంతో ప్లాస్మాను వేడి చేయడానికి సహాయపడుతుంది.ఫ్యూజన్ ప్రక్రియలో ప్లాస్మాను అత్యంత వేడికి చేర్చడమే కాకుండా, దానిని తగిన సమయం పాటు స్థిరంగా ఉంచడం కూడా అత్యంత కీలకం. కొత్త గైరో ట్రాన్ ఈ ప్రయోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సైంటిస్టులకు ఉపయోగపడింది.ఫ్యూజన్ (కేంద్ర సంలీన చర్య) ముఖ్యంగా సూర్యుడి వంటి నక్షత్రాల్లో జరుగుతుంది. దీని వల్ల అపారమైన శక్తి వెలువడుతుంది. స్వచ్ఛమైన భారీ స్థాయిలో శక్తిని అందించగల సామర్థ్యం దీని సొంతం. ఇందులో హైడ్రోజన్ ఐసోటోపులను ఇంధనంగా ఉపయోగించే అవకాశం ఉంది. హైడ్రోజన్ ఐసోటోపులు ఢీకొని హీలియంగా మారి, భారీ శక్తి విడుదల అవుతుందిప్రస్తుతం సాంప్రదాయ అణు విద్యుత్ కేంద్రాల్లో జరిగే న్యూక్లియన్ ఫిజన్(కేంద్ర విచ్ఛిత్తి చర్య) వల్ల యురేనియం లేదా ప్లూటోనియం ఢీకొట్టుకోవడం వల్ల చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. దీని వల్ల శక్తి విడుదల అవుతుంది. ఫిషన్‌తో పోలిస్తే ఫ్యూజన్ చర్యలో దీర్ఘకాలికంగా నిల్వ చేయాల్సిన రేడియోధార్మిక వ్యర్థాల సమస్య తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. తక్కువ ఇంధనంతో భారీ శక్తిని ఉత్పత్తి చేయవచ్చు.అణు రియాక్టర్లలో న్యూక్లియన్ ఫిషన్ చర్య ఒక విచ్ఛిత్తి మరో విచ్ఛిత్తికి దారి తీసే చైన్ రియాక్షన్ ఉంటుంది. ఫ్యూజన్‌లో ప్లాస్మా పరిస్థితులు కొనసాగకుంటే ఫ్యూజన్ చర్య వెంటనే స్వయంగా ఆగిపోతోంది. దీని వల్ల పెద్ద ప్రమాదాలు ఉదాహరణకు చెర్నోబిల్ వంటి ప్రమాదాలు ఉండవు. ఫ్యూజన్ చర్యలో విడుదలయ్యే హీలియం రేడియో యాక్టివ్ కాదు. అణు వ్యర్థాల సమస్యే ఉండదు.

## ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

- మొదటి పేజి తరువాయి

విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు" అని పార్థసారథి తీవ్రంగా ధ్వజమె త్తారు .డీఎస్సీ నియామకాల విషయంలో కూడా చిన్న సమస్యలను పట్టుకుని యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళ్లి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

### కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది. ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది.కొత్త పోలీస్ కమిషనరేట్లు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. దీంతోపాటు సైబర్, సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు.ఉద్యోగులకు డబుల్ బొనాంజా: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం చంద్రబాబు తీపికబురు అందించారు. వారికి 1.7.2024 నుంచి 2.73%, 1.1.2025 నుంచి 1.82% చొప్పున రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

### అమరావతి పునరుజ్జీవం.. రైతులకు న్యాయం

అసెంబ్లీకి రూ.661 కోట్లు: అమరావతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో, తెలుగు ప్రజలు గర్వపడేలా శాసనసభ భవనం నిర్మించేందుకు రూ.661 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. రాజధానిలోని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కోసం మరో రూ.1,543.98 కోట్లను కేటాయించారు.చిన్న రైతులకు భరోసా: భూ సమీకరణ పథకం కింద ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన రైతులకు కూడా ఎకరాకు వర్తించే విధంగా వార్షిక కౌలు (యాన్యుటీ) చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది రాజధాని రైతులకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయం.

### ఇతర ముఖ్యమైన నిర్ణయాలు

మద్యం పాలసీ: మద్యం దుకాణాల లైసెన్సులను పునరుద్ధరిస్తూ, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. తొలిసారి ఉల్లంఘిస్తే రూ.10 లక్షల జరిమానా, రెండోసారి లైసెన్స్ రద్దు చేయాలని నిర్ణయించారు.

షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ: మూతపడిన సహకార చక్కెర కర్మాగారాల (చోడవరం, గోవాడ మొదలైనవి) సమస్యల పరిష్కారానికి, రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం రుణం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

సామాజిక మీడియా పాలసీ: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 'సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ పాలసీ'కి ఆమోదం తెలిపారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వారికి పారితోషికం చెల్లిస్తారు.

న్యాయాధికారుల పదవీ విరమణ: న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్డినెన్స్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు.

భూ కేటాయింపులు: సాగర్మాల ప్రాజెక్టుల కింద భూసేకరణకు ఏపీఐఐసీకి రూ.2,500 కోట్ల టర్మ్ లోన్ వినియోగానికి, విజయనగరంలో మిల్లెట్ల ప్రాసెసింగ్ యూనిట్ కోసం డీఆర్‌డీఏకు ఉచితంగా భూమి కేటాయింపు వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లు: వార్డు సచివాలయాల్లోని పలు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు, ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం ద్వారా కూటమి ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే, మరోవైపు ఉద్యోగ, రైత, ప్రజా సంక్షేమానికి, పరిపాలన సంస్కరణలకు కట్టుబడి ఉన్నామని స్పష్టమైన సందేశాన్ని పంపింది.

# టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుకు సంబంధించి వైసీపీకి చెందిన పలువురు కీలక నేతలు సహా మొత్తం 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ జాబితాలో వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెల్ల అప్పిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ వంటి ప్రముఖుల పేర్లు ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.వివరాల్లోకి వెళితే, 2021 అక్టోబర్ 19న గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. ఈ ఘటనపై తాజాగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలకు రౌడీ షీట్లు తెరవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)లకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఈ దాడి జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో వైసీపీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కర్రలు, సుత్తులతో కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్, కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ఆవరణలో నిలిపి ఉంచిన కార్లను కూడా ధ్వంసం చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు.

ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో తలశిల రఘురాం, దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సహా మొత్తం 110 మందిపై కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్లు 147, 148, 323, 324, 326, 307, 380, 427, 459, 452, 506 రెడ్ విత్ 109, 120-బి, 149 కింద కేసు నమోదు చేసి

దర్యాప్తు చేపట్టారు.2024 జూన్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుపై మళ్లీ దృష్టి సారించింది.

2024 అక్టోబర్ లో ఈ కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో పాటు 2021 సెప్టెంబర్‌లో చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసును కూడా సీఐడీ విచారణకు బదిలీ చేసింది. తాజా పరిణామాలతో పాత కేసుల దర్యాప్తులో వేగం పుంజుకోవడం, వైసీపీ నేతలపై రౌడీ షీట్లు తెరవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# తిరుమలలో వైభవంగా చక్రస్నానం..

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు.

అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు.అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

### విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు

ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమిష్టిగా పనిచేశామని వివరించారు. ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే తమ ప్రథమ కర్తవ్యమని, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో కొట్లాట..

- మొదటి పేజి తరువాయి

పరిస్థితులు నెలకొన్నాయి. అసోసియేషన్ 'మినిట్స్ బుక్' దక్కించుకునే క్రమంలో ప్రస్తుత అధ్యక్షురాలు, జానీ మాస్టర్ భార్య సుమలత, కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ గొడవ ముదిరి రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. అసోసియేషన్ కు సంబంధం లేని వ్యక్తులు కుట్రతో తమపై దాడి చేశారని సుమలత ఆరోపించింది. సుమలత మనుషులే తమపై దాడి చేశారంటూ రఘు మాస్టర్ వర్గం పేర్కొంది. ఈ ఘటనపై ఇరువర్గాలు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సుమలత తీరుపై ఆగ్రహంతో ఉన్న కొందరు తోటి డ్యాన్సర్లు ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ గొడవకు కారణం.. అంతకుముందు తెలుగు ఫిలిం ఫెడరేషన్ తీసుకున్న ఒక సంచలన నిర్ణయం.. డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో నెలకొన్న సమస్యలను తేల్చేందుకు ఫెడరేషన్ పెద్దలు సుమలత, రఘు మాస్టర్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 225 మంది సినీ డ్యాన్సర్లు హాజరైన ఈ మీటింగ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా అభిప్రాయ సేకరణ జరిపారు.

ఈ ఓటింగ్‌లో ఏకంగా 214 మంది డ్యాన్సర్లు రఘు మాస్టర్‌కే మద్దతు తెలపగా.. సుమలత వైపు కేవలం 11 మంది మాత్రమే నిలిచారు.

దీంతో మెజారిటీ నిర్ణయం మేరకు సుమలత నేతృత్వంలోని కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఫెడరేషన్ ప్రకటించింది. అంతేకాకుండా, అక్టోబర్ 11న అసోసియేషన్ నూతన ఎన్నికలు నిర్వహిస్తామని షెడ్యూల్ విడుదల చేసింది.

ఫెడరేషన్ తీసుకున్న ఈ ఊహించని షాకింగ్ నిర్ణయం, ఎన్నికల షెడ్యూల్‌తో డ్యాన్సర్ల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఏకంగా ఫిల్మ్ ఛాంబర్‌లోనే దాడికి పాల్పడేంతగా వివాదం చెలరేగడంతో అక్టోబర్ 11న జరగబోయే ఎన్నికలు ఇంకెన్ని మలుపులు తిరుగుతాయోనని ఇండస్ట్రీ వర్గాలు ఉత్కంఠగా గమనిస్తున్నాయి.

# బీజేపీలో భారీ మార్పులు..

రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు. తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

ఆంధ్రప్రదేశ్: అర్విండ్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

**తమిళనాడు:** రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కో-ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురానా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ

ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు.

మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జ్‌లుగా నియమించారు.

ఛత్తీస్‌గఢ్ - హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జ్‌లుగా నియమించారు.

గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

# రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

టార్గెట్ నుంచి లా అండ్ ఆర్డర్ వరకు అన్ని అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై రైల్వే యాక్ట్ తరహాలో కఠిన చట్టం తీసుకురావాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజకీయ నాయకుల ముసుగులో అసాంఘిక శక్తులు విధ్వంసానికి పాల్పడుతున్నాయని, వైకాపా రౌడీ మూకలు అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. జగన్ బెంగళూరులో కూర్చుని రౌడీ గ్యాంగ్ ద్వారా ఏపీలో అరాచకాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్‌ను దెబ్బతీసే ఎలాంటి ప్రయత్నాన్నీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. శాప్ కార్యాలయం వద్ద జరిగిన దాడి ఘటన.. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడిన తీరు బట్టబయలైందని చంద్రబాబు అన్నారు. శాప్ కార్యాలయం, టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌పై జరిగిన దాడుల్లో ఒకే వ్యక్తులు ఉన్నారన్న అంశాన్ని ప్రస్తావించారు. వైసీపీ నేతలు జరగని విషయాలను జరిగినట్లుగా ప్రచారం చేయడంలో సిద్ధహస్తులని ఆరోపిస్తూ, ఉద్దేశపూర్వకంగా బురద చల్లే ప్రయత్నాలను తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

# సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత యువతరానిదే

- మొదటి పేజి తరువాయి

సెంటర్, క్వాంటమ్, డీప్ టెక్నాలజీ వస్తున్నాయి. కర్నూలులో అన్ని రకాల డ్రోన్లు తయారు చేస్తున్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. భవిష్యత్తు అంతా ఇన్నోవేషన్స్ రంగానిదే. ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి. సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత యువతరానిదే" అని సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు.. సీఎం చంద్రబాబు సమీక్ష

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రాష్ట్రం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఈ తీవ్ర వాయుగుండం శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.ఇది తీరం దాటే సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, జిల్లా కలెక్టర్లు, అధికారులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ వాటిని అనుమతించి ఉంటే, అటువంటి చర్య దేశద్రోహం కిందకే వస్తుందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నీలంబూరులో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయని వెలువడిన మీడియా కథనాలపై ఆమె స్పందించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి "అత్యంత ప్రమాదకరం" అని ఆమె అభివర్ణించారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సందర్భంగా పేర్ల తొలగింపు సహా పలు ఇతర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అసమ్మతి వ్యక్తం చేశారన్న కథనాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించారని గత కొంతకాలంగా వస్తున్న ఆరోపణలను ఆమె గుర్తుచేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగకపోతే లేదా ఈసీయే అక్రమాలకు సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగిన గొడ్డలిపెట్టుగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ ఇదివరకే స్పష్టం చేయడం గమనార్హం.

# అంబానీని వెనక్కి నెట్టిన అదానీ.. తగ్గిన ముఖేశ్ అంబానీ సంపద!

- మొదటి పేజి తరువాయి

అంబానీని వెనక్కి నెట్టారు. ఈ జాబితాలో ఆర్సెలర్‌మిట్టల్ యజమాని ఎల్.ఎన్. మిట్టల్ కుటుంబం 93 శాతం వృద్ధితో, రూ. 3.39 లక్షల కోట్ల సంపదతో మూడో స్థానంలో నిలిచింది.ఈ ఏడాది జాబితాలో మహిళా సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. కొత్తగా 131 మంది మహిళలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. మహిళల విభాగంలో రూ. 2.79 లక్షల కోట్ల సంపదతో రోష్నీ నాడార్ మల్హోత్రా అగ్రస్థానంలో నిలిచారు. దేశంలో డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో 391కి చేరింది. అత్యధిక సంపన్నులు ఉన్న నగరంగా ముంబై ప్రథమ స్థానంలో నిలవగా, బెంగళూరు, ఢిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.సాంకేతిక రంగం నుంచి కొత్త సంపన్నుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగానికి చెందిన 19 మంది ఈ జాబితాలో స్థానం సంపాదించగా, వారిలో 15 మంది కొత్తవారు కావడం విశేషం. క్వాంటం కంప్యూటింగ్ విభాగం నుంచి తొలిసారిగా బెంగళూరుకు చెందిన నాగేంద్ర నాగరాజ రూ. 1,700 కోట్ల సంపదతో ఈ జాబితాలో చేరారు.

## చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని, అడ్డగోలుగా భూములను పంచుకుంటున్నారని మండిపడ్డారు.ప్రతి గ్రామంలో గంజాయితో పాటు విచ్చలవిడిగా మద్యం దొరుకుతోందని, గుళ్ళ, బడుల పక్కన కూడా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. విశాఖ మేయర్, కార్పొరేషన్‌ను ప్రభుత్వం హైజాక్ చేసిన తీరును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రతి కార్యకర్తకు అన్నివేళలా అండగా ఉంటుందని, విశాఖలోని తాగునీటి సమస్యలు, భూముల అక్రమాలపై ప్రజల్లో పోరాడాలని సూచించారు. చంద్రబాబుకు ప్రజాస్వామ్యం అంటే లెక్కలేదని, 2019 నంద్యాల ఉపఎన్నిక నుంచి పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. తాత్కాలిక అధికారంతో విర్రవీగినా... శాశ్వతంగా నిలిచేది ప్రజాస్వామ్యమేనని, ప్రజల తీర్పు నుంచి ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# చట్టాలపై యువత అవగాహన పెంచుకోవాలి

- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. విద్యపై దృష్టి సారించాలి
- జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- మెజిస్ట్రేట్ మురళీ గంగాధరరావు



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని పురస్కరించుకుని రంపచోడవరం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇర్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. రంపచోడవరం జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ మురళీ గంగాధరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు వివిధ చట్టాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మురళీ గంగాధరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ చట్టాలపై కనీస అవగాహన ఉండటం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకుని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. విద్య ప్రతి బాలబాలికకు అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న శిక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటికీ కొందరు పిల్లలు చదువును మధ్యలోనే నిలిపివేసి పనులకు వెళ్తున్నారని, బాలలు బడి మానకుండా చూడటం ద్వారా విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగం, విద్యా హక్కు, బాలల రక్షణ చట్టాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. భారత రాజ్యాంగ ఆవిర్భావం, దాని విలువలు, ప్రాథమిక విధులు, రాజ్యాంగంలోని 21, 21-ఏ అధికరణాల ప్రాముఖ్యత, విద్యా హక్కు చట్టం గురించి వివరించారు. బాలికలు తమ హక్కులు, విధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గిరిజన హక్కుల చట్టాలు, భూ హక్కుల చట్టాలు, గిరిజనులకు సంబంధించిన ప్రత్యేక చట్టాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక చట్టం, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల నియంత్రణ చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు, బాలురు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాను తెలుసుకోవాలని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా తమను తాము రక్షించుకోవడంతో పాటు సమాజంలో ఇతరులకు కూడా అవగాహన కల్పించగలరన్నారు.

**మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలు, దుష్ఫలితాలను మెజిస్ట్రేట్ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కావద్దని హెచ్చరించారు. చెడు అలవాట్లకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ప్రస్తుత దశలోనే చదువుపై పూర్తి దృష్టి సారించి భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. తమ చుట్టుపక్కల ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగానికి బానిసలవుతున్నట్లు గమనిస్తే వారిని కూడా ఆ దుష్ప్రభావాల నుంచి బయటపడేలా అవగాహన కల్పించాలని కోరారు. నేటి విద్యార్థులే రేపటి ఉన్నతాధికారులు అని పేర్కొన్న మెజిస్ట్రేట్, విద్యార్థులు సమాజం పట్ల, పెద్దల పట్ల గౌరవంగా మెలుగుతూ మంచి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి డిసెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మురళీ గంగాధరరావు సూచించారు. రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసులు ఏవైనా ఉంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. వివాదాలకు సత్వర పరిష్కారం లభించేలా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని, న్యాయ సేవల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు.

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**

పర్యావరణ పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని మెజిస్ట్రేట్ తెలిపారు. "వృక్షో రక్షతి రక్షితః" అనే విషయాన్ని గుర్తుంచుకుని చెట్లను సంరక్షించడంతో పాటు విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించి పర్యావరణ పరిరక్షణలో వారిని భాగస్వాములను కావాలని కోరారు.

**హాస్టల్ వసతులపై ఆకస్మిక తనిఖీ**

న్యాయ అవగాహన కార్యక్రమం అనంతరం మెజిస్ట్రేట్ మురళీ గంగాధరరావు పాఠశాల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. మొత్తం పరిశీలన అనంతరం వసతులు సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా నీటిని అందుబాటులో ఉంచాలని, వీలైనచోట కాచి చల్లార్చిన నీటిని కూడా విద్యార్థులకు అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది టి. వీరబాబు, కోర్టు సూపరింటెండెంట్ నాగభూషణం, పోలీసు సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కావాలంటే ఇదే సమాచారాన్ని పెన్ పవర్ ఫ్రంట్ పేజీ బ్యానర్ స్టోరీ శైలిలో మరింత ప్రభావవంతమైన శీర్షికలు, ఉపశీర్షికలతో కూడా తయారు చేయగలను.

# 2027 గోదావరి పుష్కరాలకు వసతి ఏర్పాట్లపై పకడ్బందీ కార్యాచరణ





- శాఖల వారీగా సిబ్బంది వివరాలు ముందుగానే సేకరించి, ఘాట్లకు సమీపంలో వసతి కల్పించాలి
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 23:**గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో విధులు నిర్వహించే వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి అవసరమైన వసతి సౌకర్యాలను ముందుగానే గుర్తించి, పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా వసతి సౌకర్యాలపై కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పుష్కరాల సమయంలో వివిధ శాఖల నుంచి ఎంతమంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారనే వివరాలను ముందుగానే సేకరించి, అందుకు అనుగుణంగా వసతి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి తహసీల్దార్ తమ పరిధిలో ఎంతమంది సిబ్బందికి వసతి అవసరమవుతుందో, ఏయే కేటగిరీలకు చెందిన సిబ్బందికి వసతి కల్పించాల్సి ఉంటుందో మండలాల వారీగా గుర్తించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఐఏఎస్ స్థాయి అధికారుల నుంచి పారిశుధ్య సిబ్బంది వరకు వివిధ కేటగిరీల సిబ్బంది అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరపున శాఖల వారీగా నియమించే సిబ్బంది వివరాలను ముందుగానే అందిస్తామని, వాటి ఆధారంగా మండల స్థాయిలో వసతి ప్రణాళికను ఖరారు చేయాలని స్పష్టం చేశారు. శాశ్వత ఘాట్లు, తాత్కాలిక ఘాట్ల వారీగా సిబ్బంది నియామకాన్ని ముందుగానే అంచనా వేసి, వారికి కేటాయించే విధులకు అనుగుణంగా సమీప ప్రాంతాల్లో తగిన వసతి ఉందా లేదా పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వైద్య, పోలీసు, పారిశుధ్య తదితర అత్యవసర సేవల సిబ్బందికి ఘాట్లకు సాధ్యమైనంత సమీపంలోనే వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది షిఫ్టుల సమయాలు, విశ్రాంతి సౌకర్యాలు, ఆహార తయారీ, ఆహార సరఫరా వంటి అంశాలను కూడా ముందస్తు ప్రణాళికలో పొందుపరచాలని ఆదేశించారు. తాత్కాలిక పుష్కర నగరాల ఏర్పాటుకు గుర్తించిన స్థలాల్లో వసతి సౌకర్యాలతో పాటు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, స్నానపు గదులు తదితర మౌలిక వసతులను ముందుగానే కల్పించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, వసతి గృహాలు, ప్రైవేటు అతిథి గృహాలు, హోటళు తదితర అందుబాటులో ఉన్న వసతి సదుపాయాలను గుర్తించాలని తెలిపారు. వీఐపీ వసతి అవసరాలను కూడా ముందుగానే గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వసతి సౌకర్యాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. స్థానికంగా ప్రజల నుంచి వచ్చే సమస్యలను క్షేత్రస్థాయిలో ముందుగానే గుర్తించి, వాటిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలను కూడా మండల స్థాయి కార్యాచరణ ప్రణాళికలో పొందుపరచాలని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ మాట్లాడుతూ ప్రతి శాఖ నుంచి పుష్కరాల విధులకు నియమించనున్న సిబ్బంది వివరాలను ముందుగానే సేకరించి, వారి సంఖ్యకు అనుగుణంగా మండలాల వారీగా వసతి అవసరాలను నిర్ధారించాలన్నారు. శాశ్వత, తాత్కాలిక ఘాట్ల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన వసతి, ఆహారం, విశ్రాంతి తదితర సౌకర్యాలపై సంబంధిత శాఖలు ముందస్తు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. వసతి ఏర్పాట్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల మధ్య సమన్వయంతో ముందస్తు కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగర పరిధిలో పుష్కరాల విధులకు వచ్చే అధికారులు, సిబ్బంది కోసం అందుబాటులో ఉన్న వసతి ప్రాంతాలను గుర్తించి, వాటి సామర్థ్యం, మౌలిక సదుపాయాలపై వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. హోటల్ నిర్వహణ సంఘం ప్రతినిధులతో ఈ వారంలో సమావేశం ఏర్పాటు చేసి, అందుబాటులో ఉన్న వసతి గదులు, ఆహార తయారీ, సరఫరా తదితర అంశాలపై వివరాలు సేకరించాలని అధికారులను సమన్వయం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఘాట్లకు సమీపంలో సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖలకు చెందిన అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. శాఖల వారీగా సిబ్బంది నియామకం, మండలాల వారీగా వసతి అవసరాలు, శాశ్వత, తాత్కాలిక ఘాట్ల వద్ద సిబ్బంది కేటాయింపు, తాత్కాలిక పుష్కర నగరాల్లో మౌలిక వసతులు, ఆహార సరఫరా తదితర అంశాలపై అధికారులు వివరాలను సమర్పించారు.

# తిరుమల చైర్మన్ రేసులో జగ్గంపేట పెద్దాయన...??








- జ్యోతుల నెహ్రూకు బృహత్తర బాధ్యతలపై సర్వత్రా ఆసక్తి..
- నాలుగు సార్లు ఎమ్మెల్యే, లిమెట్ట ప్రాంతానికి పెద్దదిక్కు, క్రమశిక్షణకు మారుపేరు.
- మంత్రి పదవి ఆశించిన సీనియర్ కు టీటీడీ బాధ్యతలపై ఊహాగానాలు

**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 22:-**తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలకమండలి చైర్మన్ బి ఆర్ నాయుడు పదవీకాలం నవంబర్ లో ముగియనున్న నేపథ్యంలో,తదుపరి చైర్మన్ ఎవరు అనే దానిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు,జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ (జ్యోతుల వెంకట అప్పారావు) పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

**సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం :--**

1994-1999 లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా జ్యోతుల నెహ్రూ రాజకీయ ప్రస్థానం మూడు దశాబ్దాల పై బడినది. 1994 -1999 తొలిసారిగా తెలుగుదేశం పార్టీ నుండి జగ్గంపేట ఎమ్మెల్యేగా విజయం (20,301 ఓట్ల మెజారిటీ)1999 - 2004 రెండోసారి అదే స్థానం నుండి విజయం (9,814 ఓట్ల మెజారిటీ) 2014 - 2019 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి మూడోసారి ఎమ్మెల్యేగా విజయం (15,932 ఓట్ల మెజారిటీ)

2024 - ప్రస్తుతం నాలుగోసారి తెలుగుదేశం పార్టీ నుండి అత్యధిక మెజారిటీతో (52,676 ఓట్లు) ఘన విజయంసాధించారు. మధ్యలో 2009లో ప్రజారాజ్యం నుండి, 2004, 2019లో పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చవిచూసినా, జగ్గంపేట నియోజకవర్గంలో ఆయనకు ఉన్న పట్టు చెక్కుచెదరలేదు. ప్రస్తుతం ఆయన టీటీడీ పాలకమండలి డైరెక్టర్ గా కూడా సేవలందిస్తున్నారు.

**మంత్రి పదవి ఆశ, క్రమశిక్షణకు ప్రతీక :--**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వయసులో పెద్దగా, ఒక కుటుంబ పెద్దగా వ్యవహరించే జ్యోతుల నెహ్రూకు రెండు పర్యాయాలు మంత్రి పదవి అందినట్లే అంది చేజారింది. అయినా ఎప్పుడూ పార్టీ గీసిన గీత దాటని క్రమశిక్షణ,అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ బాధ్యత అప్పగించినా అనర్గళంగా, దీటుగా స్పందించే తత్వం ఆయన ప్రత్యేకత. దీంతోనే చంద్రబాబు కుటుంబానికి ఆయనపై ప్రత్యేక అభిమానం ఉందని పార్టీ వర్గాలు చెబుతాయి. తన స్థానాన్ని బ్యాలెన్స్ చేయడానికి తన కుమారుడు జ్యోతుల చంటిబాబుకు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించినా, నియోజకవర్గ ప్రజల్లో, క్యాడర్ లో "పెద్దాయనకు తగిన గౌరవం దక్కాలి" అనే ఆకాంక్ష ఇంకా ఉంది.

**టీటీడీ చైర్మన్ గా అవకాశం - సామాజిక సమీకరణం :-**

కలియుగ ప్రత్యక్ష దైవం కొలువైన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ పదవి అంటే ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్టాత్మకమైనది. రెండేళ్ల పాలనా దక్షత కలిగిన పదవి. మెట్ట ప్రాంతానికి పెద్దదిక్కుగా, జిల్లాలోనే కాక రాష్ట్రంలోనూ సమస్యలు వచ్చినప్పుడు పెద్దన్న పాత్ర పోషించిన అనుభవం ఉన్న జ్యోతుల నెహ్రూకు ఈ బాధ్యతలు అప్పగిస్తే, పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ఆయన సామాజిక వర్గం కూడా పార్టీకి మరింత దగ్గరవుతుందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఇవన్నీ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో,పార్టీ శ్రేణుల్లో వినిపిస్తున్న ఊహాగానాలు మాత్రమే. దీనిపై పార్టీ అధిష్టానం అధికారికంగా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. తన సన్నిహితులు కూడా "అధినేత నిర్ణయం వచ్చే వరకు ఎవరూ ఎలాంటి ప్రకటనలు చేయవద్దు" అని సూచిస్తున్నట్లు తెలిసింది.

**ఏది ఇచ్చినా నియోజకవర్గంలో హర్షం :--**

టీటీడీ చైర్మన్ ఇస్తారా? లేక మంత్రివర్గంలో స్థానం కల్పించి పెద్దాయన చిరకాల కోరిక తీరుస్తారా? అనేది వేచి చూడాల్సిందే.ఏ బాధ్యత ఇచ్చినా జగ్గంపేట, కిర్లంపూడి, గోకవరం, గండేపల్లి మండలాల ప్రజలు, ఉభయ గోదావరి జిల్లాల అభిమానులు హర్షం వ్యక్తం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.మంత్రి అయినా లేక తిరుమల తిరుపతి దేవస్థాన చైర్మన్ అయినా ఒక క్యాబినెట్ ర్యాంకు రావడంతో జగ్గంపేట నియోజవర్గ ప్రజలకు మేలు జరుగుతుందని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

ప్రత్యేక కథనం:-- బత్తిన రామకృష్ణ

# జట్లపాలెం గ్రామ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 23.**పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఒ ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, జట్లపాలెం గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పదవీవిరమణ పొందిన ప్రజాప్రతినిధులకు ఘన సత్కారం



**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**తాళ్ళపూడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీవిరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధులకు మండల పరిషత్ అధికారులు, సిబ్బంది ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.

ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మల, డిప్యూటీ ఎంపీడీవో అమ్మిరాజు ఆధ్వర్యంలో పదవీవిరమణ పొందిన ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి అభినందించారు. ప్రజలకు సేవలందించడంలో వారు అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది గుర్తు చేసుకున్నారు.

మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని పదవీవిరమణ పొందిన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రతినిధులుగా తమ పదవీకాలంలో గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా పదవీవిరమణ పొందిన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ తమ పదవీకాలంలో అధికారులు, సిబ్బంది అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పరస్పరం అభినందనలు తెలియజేసుకుంటూ కార్యక్రమాన్ని ఆత్మీయ వాతావరణంలో ముగించారు.

## అక్టోబరు 2, 3, 4తేదీల్లో క్రెడాయ్ హోమ్ ఎక్స్ పో




- ఒకే వేదికలో 120 స్టాల్స్ లో సమగ్ర సమాచారం
- నిర్మాణ రంగ అభివృద్ధికి నిబంధనలు సరళీకరించిన ప్రభుత్వం
- మీడియా సమావేశంలో క్రెడాయ్ ప్రతినిధులు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**రియల్ ఎస్టేట్ రంగంలో స్థలం కొనుగోలు నుంచి భవన నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు వినియోగ దారులకు అవసరమైన సమగ్ర వివరాలతో అక్టోబరు 2,3 ,4 తేదీల్లో జె ఎన్ రోడ్డులోని చెరుకూరి వీర్రాజు, సుబ్బలక్ష్మి కన్వేషన్ సెంటర్ లో మూడు రోజులపాటు హోమ్ ఎక్స్ పో నిర్వహిస్తున్నట్లు క్రెడాయ్ ప్రతినిధులు వెల్లడించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్, నగర చాప్టర్ చైర్మన్ సూరవరపు శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ మన్యం సంతోష్ ఫణి కుమార్, జనరల్ సెక్రటరీ చల్లా బాల మురళికృష్ణ, జాతీయ ఎన్విరాన్ మెంట్ కమిటీ మెంబర్ కర్రి శేఖర్ రెడ్డి బుధవారం మీడియా సమావేశం లో మాట్లాడారు. ప్రతి రెండేళ్లకోసారి హోం ఎక్స్ పో నిర్వహిస్తామని, గతంలో నిర్వహించిన ఐదు హోం ఎక్స్ పో లకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈసారి 120 స్టాల్స్ పైగా భారీ ఎక్స్ పో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్స్ పో లో పలు రకాల కంపెనీల బ్రాండ్ల కు చెందిన అధునాతన, సాంకేతిక గృహ ఉపకరణాలు , మెటీరియల్స్ ప్రదర్శనకు ఉంటాయన్నారు. అంటే లేఅవుట్ వెంచర్స్, బిల్డర్స్, ఆర్కిటెక్ట్స్, డిజయినర్స్, సివిల్ ఇంజినీర్స్ సేవలు అన్ని ఒకే వేదిక పై అందుబాటులో ఉండడం వలన వినియోగ దారులకు వెసులుబాటు, సమయం కూడా లభిస్తుంద న్నారు. గంటగంటకు లక్కీ డీప్ నిర్వహిస్తామని తెలిపారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఎక్స్ పో ప్రారంభోత్సవానికి హాజరవుతారని తెలిపారు. నగర ప్రజలు ఈ ఎక్స్ పో సందర్శించి విజయవంతం చేయాలని ప్రజలకు వారు విజ్ఞప్తి చేసారు. భవన నిర్మాణ రంగం గురించి బుడ్డిగ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించే చర్యలు చేపట్టిందన్నారు. క్రెడాయ్ సూచనలను పరిగణనలోకి తీసుకుని నిబంధనలు సరళతరం చేస్తూ జీవోలు కూడా ప్రభుత్వం జారీ చేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, పి. నారాయణలకు, ఇతర మంత్రులకు, ప్రజాప్రతి నిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రె.రా చట్టం రాకముందే క్రెడాయ్ కొన్ని నిబంధనలు ఏర్పాటు చేసుకుని అమలు చేస్తోందని ఆయన గుర్తుచేసారు. ఖాతాదారులకు ఇచ్చిన హామీ ప్రకారం నిర్మాణలు పూర్తిచేసి అప్పగిస్తున్నామన్నారు. లోపాలు జరిగితే సామరస్యంగా సెటిల్ చేస్తున్న మన్నారు. రెరా చట్ట నిబంధనలు పాటించే క్రెడాయ్ సభ్యులకు విశ్వసనీయత ఉందన్నారు. ప్రభుత్వం నగర పరిసర ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజి వంటి మౌలిక సదుపాయాలు కల్పించి, మాస్టర్ ప్లాన్ అమలు చేయడం వల్ల గృహ నిర్మాణాలు వేగవంతం అవుతాయని, ఖర్చు తగ్గుతుందని, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని బుడ్డిగ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. స్థలం కొనుగోలుకు వీలుగా ధరలు ఉన్నప్పుడు భవన నిర్మాణాలు పెరుగుతాయ న్నారు. గ్రేటర్ రాజమహేంద్రవరం చేయడం వల్ల నిధులు లభ్యత పెరిగి నగర శివారు ప్రాంతాలు, విలీన గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ సమావేశంలో క్రెడాయ్ నగర ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, కోశాధికారి టివిఎల్ నరసింహారావు, కార్యవర్గ సభ్యులు యెజ్జు శ్రీనివాస కిరణ్, బళ్లా వర ప్రసాద్, రుత్తల అనిల్, కోన మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## సాయి దుర్గానగర్ లో అక్రమ నిర్మాణం కూల్చివేత




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**నగరంలో అనధికార నిర్మాణాలపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. స్థానిక సాయిదుర్గానగర్లో నగరపాలక సంస్థ నుండి అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని నగర ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. నిర్దేశిత అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారు స్వచ్ఛందంగా తొలగించు కోకుంటే నగరపాలక సిబ్బందే పూర్తిగా తొలగిస్తారని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఇకపైనా అనధికార నిర్మాణాలు, హోర్డింగ్స్ తొలగింపు కొనసాగుతుందని.. అవసరమైతే అదనపు జేసిబీలు, సిబ్బందిని సమకూర్చుకోవాలని సిటీ ప్లానర్ ను ఆదేశించడం జరిగిందన్నారు. వార్డు సచివాలయాల వారీగా అనధికార నిర్మాణాలు, హోర్డింగ్స్ లను ఇప్పటికే గుర్తించామని, వాటన్నింటినీ షెడ్యూల్ ప్రకారం తొలగిస్తామని స్పష్టం చేశారు. భవన నిర్మాణాల సమయంలో తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని అనుమతులు పొంది, నగర ప్రణాళికా బద్ధమైన అభివృద్ధికి సహకరించవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టింబర్ యార్డు రోడ్డులో రహదారి పైకి వచ్చిన ర్యాంపులు, ప్లాట్ ఫామ్ లను పట్టణ ప్రణాళిక విభాగం తొలగించడం జరిగింది.

# పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై నిర్లక్ష్యం?

**పరిష్కార గడువు వరకు వేచి.. సమస్య తీరకుండానే పరిష్కరించినట్లు సంతకాలు తీసుకుంటున్నారంటూ ఆరోపణలు**




**తాళ్లపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)పై తాళ్లపూడి మండలంలో కొన్ని వర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. పీజీఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నప్పటికీ.. కొన్ని శాఖల్లో మాత్రం ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం జరుగుతోందని ఫిర్యాదిదారులు ఆరోపిస్తున్నారు. తమ సమస్యలపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా పరిష్కారానికి నిర్దేశించిన చివరి తేదీ వరకు వేచి చూస్తున్నారని పలువురు వాపోతున్నారు. గడువు సమీపించిన సమయంలో ఫిర్యాదుదారులను సంప్రదించి, సమస్యపై ఏదో ఒక సమాధానం చెప్పి, సమస్య వాస్తవంగా పరిష్కారం కాకపోయినా పరిష్కరించినట్లు సంతకాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రాజకీయ ఒత్తిళ్లపై కూడా ఆరోపణలు......**

మరికొందరు ఫిర్యాదిదారులు మరో అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకుల సూచనలు, ఒత్తిళ్లకు కొందరు అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు చేస్తున్నారు. దీంతో పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను నిబంధనల ప్రకారం స్వతంత్రంగా పరిశీలించి పరిష్కరించాల్సిన వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో పీజీఆర్ఎస్ వ్యవస్థను కొందరు అధికారులు దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. సమస్య పరిష్కారం కాకుండానే ఫిర్యాదు పరిష్కారమైనట్లు నమోదు చేస్తే, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఉద్దేశమే దెబ్బతింటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి....**

పీజీఆర్ఎస్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితిని తెలుసుకున్న అనంతరం మాత్రమే పరిష్కారంగా నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సమస్య పరిష్కారం కాకుండానే ఫిర్యాదులను ముగించినట్లు చూపుతున్నారనే ఆరోపణలపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పరిశీలన చేపట్టి, అవసరమైతే ఫిర్యాదిదారులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు న్యాయం అందేలా పీజీఆర్ఎస్ వ్యవస్థను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించాలని కోరుతున్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలి

**ఇన్‌చార్జి కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్‌ను కోరిన రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ**



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సహకరించాలని రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ ఫయాజ్ బాషా కోరారు. ఇటీవల జరిగిన రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫయాజ్ బాషా తన ఎన్నికకు సంబంధించిన విషయాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో జిల్లా యంత్రాంగం సహకారం అందించాలని కోరారు. ఈ మర్యాదపూర్వక భేటీలో రంపచోడవరం తహసీల్దార్ సి. హెచ్. బాలాజీ, డిప్యూటీ తహసీల్దార్లు వెంకటేష్, వి. రవీంద్రబాబు, సునీత, మహా లక్ష్మణరావు, జూనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఉద్యోగులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సి. హెచ్. నిర్మలకుమారి, సీనియర్ సంపాదకులు కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గోకవరం దేవి చౌక్ లో కనకదుర్గ అమ్మవారి దసరా మహోత్సవాల ముహూర్తం రాట.



**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 22 :-**గోకవరం మండల కేంద్రం దేవి చౌక్ లో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా మహోత్సవాల వేడుక ముహూర్తాన్ని కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు వేదమంత్రాలు పఠించగా, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దసరా మహోత్సవాల నిర్వహణకు శుభ ముహూర్తంగా భావించి రాట వేసి సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈరోజు నుంచి అమ్మవారి దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఎన్నో మహిమలు కలిగిన కనకదుర్గ అమ్మవారి ఉత్సవాల్లో భాగస్వాములు అవుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉన్నామని రథ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అమ్మవారి దసరా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులందరూ విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## నాగదేవి ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం





**రాజమహేంద్రవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 23:** వినాయక చవితి మహోత్స వాలను పురస్కరించుకొని నాగదేవి ఆటో రిక్షా ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గోకవరం బస్టాండ్ , నన్నయ మండపం శ్రీ విజయలక్ష్మి గణపతి ఆలయం వద్ద బుధవారం భారీ అన్న సమారాధన జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు పోతుల నాగ శ్రీనివాస్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా గణపతి నవరాత్రి మహోత్సవాలను స్థానిక డాక్టర్ తెలుగుదేశం నాయకులు యాళ్ళ ప్రదీప్ సుకుమార్ సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తు న్నామన్నారు. ఉపాధ్యక్షుడు వీశంశెట్టి లక్ష్మీ దుర్గ ప్రసాద్ మాట్లాడుతూ, ఈసారి 21వ సంవత్సర మహోత్సవాల్లో నాలుగు వేల మందికి భక్తులకు అన్నదానం చేశామని, ఉత్సవాలకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరాడ శ్రీను, కొల్లి నాగరాజు, భూల లక్ష్మణరావు, దుర్గారావు వి దుర్గారావు, వనము సూరిబాబు నాగులపల్లి గణేష్ చందక శివ, రామోజీ ప్రసాదు, బత్తల శ్రీనివాసు, పిల్లి సత్యనారాయణ, పిల్లి శ్రీను, చెక్కల వీరబాబు, చెరుకూరి బంగారయ్య, ఒనుముల దుర్గాప్రసాద్ బాషా గోపికృష్ణ కొండలరావు, అనసూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

## తుఫాన్ హెచ్చరికలతో అప్రమత్తమైన స్వర్ణ గ్రామ సిబ్బంది



**వై రామవరం, పెన్ పవర్,సెప్టెంబర్ 23 :** తుఫాన్ హెచ్చరికతో మండలంలో ఉన్న పెద్దేరు వద్ద స్వర్ణ గ్రామ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. బుధవారం ఉదయం నుండి కురుస్తున్న భారీ వర్షాలకు తుఫాన్ హెచ్చరికతో రెండు మండలాల సరిహద్దులో ఉన్న పెద్దేరు కు వరద వస్తుండడంతో స్వర్ణ గ్రామ సిబ్బంది అప్రమత్తమై ఎవరిని అటువైపు వెళ్ళకుండా నిరోధించారని తెలిపారు. ఈరోజు పెద్దేరులో వినాయకుని నిమజ్జన కార్యక్రమాలు వర్షం లో తడుస్తూ నిమజ్జనం చేయడం విశేషం. నిమజ్జన కార్యక్రమాన్ని స్వర్ణ గ్రామ సిబ్బంది పోలీసులు దగ్గర ఉండి ఏ విధమైన ఇబ్బందులు కలవకుండా జాగ్రత్త వహించారు.

## నులిపురుగుల నివారణ దినోత్సవానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు..



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**ఈనెల 25న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని , మండలంలోని అన్ని విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా 0--19 సంవత్సరాల లోపు పిల్లలకు మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను నమిలి, చప్పరించి, మింగించే విధంగా చర్యలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు బుధవారం అడ్డతీగల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఏవీవీ కుమార్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా విద్యా, వైద్య శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో సీడీపీఓ క్రాంతి, ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. దేవి ప్రియాంక, దుప్పులపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్. శివరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నగరంలోని వాడుక నీటిని పూర్తిస్థాయి శుద్ధికి చర్యలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**నగరంలోని వాడుక నీరుని పూర్తిస్థాయిలో శుద్ధి చేసేలా నగరపాలక సంస్థ చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి హుకుంపేటలో పర్యటించి 30 ఎం ఎల్ డి సీవేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ ను పరిశీలించారు. ప్లాంట్‌లోకి వచ్చే మురుగునీరు, శుద్ధయి బయటకు వెళ్లే నీరు పీహెచ్ విలువలు, ఉష్ణోగ్రత , రసాయన శాతాన్ని ప్రతిరోజూ రికార్డు చేయాలని సూచించారు. ప్లాంట్ యంత్రాలు దెబ్బ తినకుండా ఉండటానికి ప్లాస్టిక్ కవర్లు, బట్టలు, రాళ్లు వంటి ఘన వ్యర్థాలను స్క్రీనింగ్ ద్వారా ముందే వేరు చేయా లన్నారు. హానికరమైన బ్యాక్టీరియా, వైరస్ లను నశింపజేయడానికి చివరి దశలో క్లోరినేషన్ లేదా యు వి పద్ధతులను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ నిర్దేశించిన కాలుష్య నియంత్రణ ప్రమాణాల ప్రకారమే నీటిని శుద్ధి చేసి బయటకు వదలాలని స్పష్టం చేశారు. ప్లాంట్‌లోని పంపులు, బ్లోయర్లు, విద్యుత్ మోటార్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని పేర్కొన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న 50.6 ఎం ఎల్ డి ప్లాంట్ ను పరిశీలించారు. జరుగుతున్న పనులను వేగవంతం చేసి.. అక్టోబర్ లో ట్రైల్ రన్, డిసెంబర్ లో పూర్తి వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పర్యటనలో ఎస్‌ఈ రీటా, ఈఈ మదర్శా అలీ, డీఈ విరూపాక్ష, ఏఈ ప్రసాద్, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో చిత్రలేఖనం కార్యక్రమం..



**అడ్డతీగల,పెన్ పవర్, సెప్టెంబర్ 23;** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని 25 సంవత్సరాల సేవా సంకల్ప అభియాన్ -- వికసిత్ భారత్ మన సంకల్పం కార్యక్రమంలో భాగంగా "25 కోట్ల భారతీయుల కలలు" అనే అంశంపై చిత్రలేఖనం కార్యక్రమాన్ని బుధవారం అడ్డతీగల ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈ.స్వప్న కుమారి హాజరై విద్యార్థినులతో చిత్రలేఖనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించడానికి గల ఉద్దేశ్యం, వికసిత్ భారత్ నిర్మాణంలో యువత మరియు విద్యార్థిని విద్యార్థుల పాత్ర గురించి విద్యార్థినులకు వివరించారు.
ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పుడికి. ఆదిలక్ష్మి , బీర. వెంకటలక్ష్మి , దుంపల. పండు బాబు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల వినాయకుని నిమజ్జన కార్యక్రమం..



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 23;** బుధవారం అడ్డతీగల శ్రీ సోమాలమ్మ తల్లి ఆలయం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపులో భాగంగా,బాల వినాయక యూత్ ఆధ్వర్యంలో వినాయకుడిని నిమజ్జనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను కూడా లెక్కచేయకుండా, బాలవినాయకునీ నిమజ్జన కార్యక్రమంలో యువత, గ్రామస్తులు పాల్గొని బాల వినాయకునికి వీడ్కోలు పలికారు. అనంతరం మేళం తాళాల తో నిమజ్జనా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నగరంలోని వాడుక నీటిని పూర్తిస్థాయి శుద్ధికి చర్యలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**నగరంలోని వాడుక నీరుని పూర్తిస్థాయిలో శుద్ధి చేసేలా నగరపాలక సంస్థ చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి హుకుంపేటలో పర్యటించి 30 ఎం ఎల్ డి సీవేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ ను పరిశీలించారు. ప్లాంట్‌లోకి వచ్చే మురుగునీరు, శుద్ధయి బయటకు వెళ్లే నీరు పీహెచ్ విలువలు, ఉష్ణోగ్రత , రసాయన శాతాన్ని ప్రతిరోజూ రికార్డు చేయాలని సూచించారు. ప్లాంట్ యంత్రాలు దెబ్బ తినకుండా ఉండటానికి ప్లాస్టిక్ కవర్లు, బట్టలు, రాళ్లు వంటి ఘన వ్యర్థాలను స్క్రీనింగ్ ద్వారా ముందే వేరు చేయా లన్నారు. హానికరమైన బ్యాక్టీరియా, వైరస్ లను నశింపజేయడానికి చివరి దశలో క్లోరినేషన్ లేదా యు వి పద్ధతులను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ నిర్దేశించిన కాలుష్య నియంత్రణ ప్రమాణాల ప్రకారమే నీటిని శుద్ధి చేసి బయటకు వదలాలని స్పష్టం చేశారు. ప్లాంట్‌లోని పంపులు, బ్లోయర్లు, విద్యుత్ మోటార్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని పేర్కొన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న 50.6 ఎం ఎల్ డి ప్లాంట్ ను పరిశీలించారు. జరుగుతున్న పనులను వేగవంతం చేసి.. అక్టోబర్ లో ట్రైల్ రన్, డిసెంబర్ లో పూర్తి వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పర్యటనలో ఎస్‌ఈ రీటా, ఈఈ మదర్శా అలీ, డీఈ విరూపాక్ష, ఏఈ ప్రసాద్, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 23;** భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నియోజవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బుధవారం బర్రింకలపాడు క్యాంప్ కార్యాలయంలో ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు అందుబాటులో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సమస్యాత్మక ప్రాంతాలను స్వయంగా సందర్శించి అక్కడే పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయాన్ని అందించేలా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు.

## రేపు జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, అంగన్‌వాడీలకు సెలవు

### తుపాను, భారీ వర్షాల నేపథ్యంలో నిర్ణయం

### జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ప్రశాంత్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**తుపాను, భారీ వర్షాల నేపథ్యంలో పోలవరం జిల్లా వ్యాప్తంగా గురువారం (సెప్టెంబర్ 24) అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థులు, చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ఏ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం గురువారం నిర్వహించరాదని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు సెలవు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప బయటకు వెళ్లవద్దని కోరారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, ఆదేశాలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## కూచిపూడి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఎమ్మెల్యే ముప్పిడి పరామర్శ



**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**అన్నదేవరపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు కూచిపూడి గణపతి తండ్రి కూచిపూడి సుబ్రహ్మణ్యం అకాల మరణం పట్ల కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం అన్నదేవరపేటలోని కూచిపూడి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారి వెంట తాము ఉన్నామని భరోసా ఇచ్చారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.
ఎమ్మెల్యే వెంట టీడీపీ తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు ఆళ్ల హరిబాబు, కొవ్వూరు ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఊనగట్ల సొసైటీ చైర్మన్ నాగేంద్ర, టీడీపీ నాయకులు బొడ్డు కేశవ, దొంగ రామకృష్ణ, తాళ్లూరి ప్రసాద్ తదితరులు ఉన్నారు. వారు కూడా కూచిపూడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

## తీవ్ర వాయుగుండం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు.. గంగవరంలో 24ఐ7 కంట్రోల్ రూం ఏర్పాటు



**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు పోలవరం జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంగవరం తహసీల్దార్ సిహెచ్. శ్రీనివాసరావు, ఎంపీడీవో వై. లక్ష్మణరావు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తుఫాను, భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు గంగవరం తహసీల్దార్ కార్యాలయంలో 24 గంటలూ పనిచేసే విధంగా ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచించారు. గ్రామస్థాయిలో సిబ్బంది, మండలస్థాయి అధికారులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు, తుఫాను పరిస్థితులపై గ్రామాల్లో మైకుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు.పాతబడిన, శిథిలావస్థకు చేరిన, ప్రమాదకరంగా ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారిని గ్రామ సిబ్బంది గుర్తించి, అవసరమైన సందర్భంలో పోలీసుల సహకారంతో సమీపంలోని పాఠశాలలు లేదా ప్రభుత్వ భవనాలకు తరలించాలని ఆదేశించారు. ప్రసవ సమయం సమీపించిన గర్భిణులను వైద్య సిబ్బంది గుర్తించి ముందుగానే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.
తుఫాను సహాయక చర్యల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రభుత్వ సిబ్బందిపైనా, విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారులకు ఆటంకం కలిగించే వారిపైనా విపత్తు నిర్వహణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.అత్యవసర సహాయ చర్యల కోసం గంగవరం తహసీల్దార్ 7901286817, ఎంపీడీవో 7382211766 నంబర్లను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.



# గంగవరం మండలంలో మళ్లీ పెద్దపులి సంచారం






- పశువును హతమార్చిన పులి.. అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు
- అడ్డపల్లి--ఎండపల్లి పరిసర గ్రామాల్లో భయాందోళన

**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** గంగవరం మండలంలో మళ్లీ పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. గత కొంతకాలంగా రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాల అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్న పెద్దపులి తాజాగా గంగవరం మండలంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రి ఎండపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఈ.రామవరం శివారు అటవీ ప్రాంతంలో ఓ పశువుపై దాడి చేసి హతమార్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

పెద్దపులి సంచారంతో అడ్డపల్లి, చిన్నఅడ్డపల్లి, ఈ.రామవరం, ఎండపల్లి, ఎల్లాపురం, మర్రిపాలెం తదితర పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పశువుపై దాడి జరిగిన ప్రాంతాన్ని ఫోక్స్‌పేట అటవీ రేంజ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. సంఘటనా స్థలంలో పెద్దపులి పాదముద్రలను గుర్తించినట్లు తెలిపారు.

పెద్దపులి సంచారంపై అటవీశాఖ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లవద్దని, అటవీ ప్రాంతాల వైపు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని సూచించారు.

**పెద్దపులిని పట్టుకోవాలి**

పెద్దపులి సంచారంతో పరిసర గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి దానిని బంధించాలని ఎండపల్లి మాజీ సర్పంచ్ బండారు రామలక్ష్మి కోరారు. గతంలో కూడా ఈ ప్రాంతాల్లో పెద్దపులి సంచారం వల్ల ప్రజలు భయాందోళనకు గురయ్యారని, ప్రస్తుతం పశువుపై దాడి చేయడంతో ప్రజల భయాలు మరింత పెరిగాయని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా అటవీశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన చర్యలు చేపట్టాలని కోరారు. పెద్దపులి సంచారంపై అటవీశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ పరిసర ప్రాంతాల్లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అటవీశాఖ అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.

## జడ్పీటీసీల పదవీకాలం ముగింపు సందర్భంగా ఘనంగా వీడ్కోలు

**సహకరించిన ప్రతి ఒక్కరికీ గంగవరం జడ్పీటీసీ బేబీరత్నం కృతజ్ఞతలు**



**గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 23:** జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల (జడ్పీటీసీ) పదవీకాలం బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ), జిల్లా పరిషత్ సిబ్బంది జడ్పీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గంగవరం మండల జడ్పీటీసీ బేబీరత్నం మాట్లాడుతూ తన పదవీకాలంలో ప్రజలకు సేవ చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గంగవరం మండల ప్రజానీకం అందించిన ఆదరణ, సహకారం ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజలు, మీడియా ప్రతినిధులు అందించిన సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జడ్పీటీసీగా తన పదవీకాలంలో ప్రజా సమస్యల పరిష్కారం, మండల అభివృద్ధి కోసం పనిచేసే అవకాశం కల్పించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన విధుల నిర్వహణలో సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, జిల్లా పరిషత్ చైర్మన్, సీఈఓ, జడ్పీ సిబ్బందికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. వీడ్కోలు సభలో జడ్పీటీసీ సభ్యులు, జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు, పిడుగుల హెచ్చరిక.. 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో కె. స్వాతి**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** రానున్న మూడు రోజుల పాటు రంపచోడవరం డివిజన్ పరిధిలో భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉందన్న విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో కె. స్వాతి బుధవారం తెలిపారు. భారీ వర్షాలు, పిడుగులు, వరదలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు కంట్రోల్ రూమ్‌కు తెలియజేయవచ్చని ఆమె పేర్కొన్నారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సిబ్బందికి 24ఐ7 షిఫ్ట్‌ల వారీగా విధులు కేటాయించినట్లు తెలిపారు.

కంట్రోల్ రూమ్ సంప్రదింపు నంబర్లు:

మొబైల్: 6300772025

ల్యాండ్‌లైన్: 08864-243561

టోల్‌ఫ్రీ: 1800 425 2531

భారీ వర్షాలు, పిడుగుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పిడుగులు పడే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాలు, నీటి వనరుల సమీపంలో ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కోరారు.

## వర్షంలోనూ తగ్గని భక్తి ఉత్సాహం - డీజే, కోలాటం, గరగల నడుమ గణనాథుడికి సాగనంపు





**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 22 :**-గోకవరం మండల వ్యాప్తంగా ఆది దేవుడు వినాయకుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. గత తొమ్మిది రోజులుగా మండలంలో నలుమూలలా, వీధి వీధినా పెద్దా చిన్నా తేడా లేకుండా వినాయక విగ్రహాలను నెలకొల్పి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు గరికతో ప్రత్యేక పూజలు, పిండి వంటలతో నైవేద్యాలు, ప్రతి గ్రామంలో ప్రవచనాలు, భజనలతో మండలమంతా ఆధ్యాత్మిక శోభాయమానంగా మారింది. వినాయకుడి ప్రాధాన్యతను పలువురు పెద్దలు భక్తులకు వివరించారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా సరే, భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. మండలం లో దాదాపు 90 శాతం వినాయక నిమజ్జనాలు అత్యంత ఘనంగా, సాంప్రదాయబద్ధంగా పూర్తయ్యాయి. గరగ నృత్యాలు, కోలాటాలు, డీజే సౌండ్ల మధ్య ఆడా మగా, చిన్నా పెద్దా తేడా లేకుండా భక్తులు ఎంతో ఉత్సాహభరితంగా గణపయ్యను ఊరేగిస్తూ సాగనంపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు ముందస్తుగా కమిటీ సభ్యులతో మాట్లాడి, ప్రతి నిమజ్జన ఊరేగింపును పర్యవేక్షించారు. దీంతో ఉత్సవాలు సజావుగా, ప్రశాంతంగా ముగిశాయి.

ఈ కార్యక్రమాల్లో వివిధ గ్రామాల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మేళతాళాలతో ఘనంగా గణనాథుడి నిమజ్జనం

**భక్తిశ్రద్ధలతో పాల్గొన్న పెదగార్లపాడు గ్రామస్థులు**





**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** గంగవరం మండలం పెదగార్లపాడు గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య గణనాథుడిని గ్రామంలో ఊరేగిస్తూ భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, చిన్నారులు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ఉత్సాహంగా శోభాయాత్ర చేపట్టి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మడకం చిన్నబ్బాయి దొర, కోసు వెంకన్న దొర, కారం చిన్నాలు దొర, కారం రవీంద్ర దొర, కోసు రాజన్న దొరతో పాటు పలువురు గ్రామ పెద్దలు, మహిళలు, పిల్లలు, యువత, గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కు 5 కే రెడ్ రన్

**ప్రారంభించిన కమిషనర్ రాహుల్ మీనా**






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** హెచ్ఐవీ,ఎస్టీఐ రహిత తరం కోసం యువత" అనే నినాదంతో హెచ్ఐవీ ,ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం, యువతలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా నగరంలో బుధవారం 5కే రెడ్ రన్‌ను ఘనంగా నిర్వ హించారు. స్థానిక వై జంక్షన్ నుంచి ఇస్కాన్ ఆలయం వరకు నిర్వహించిన ఈ అవగాహన పరుగులో సుమారు 300 మంది విద్యార్థులు, యువ క్రీడాకారులు, అధికారులు, వ్యాయమ విద్యా అధ్యాపకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా ముఖ్య అతిథిగా హాజరై 5కే రెడ్ రన్‌నుప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటిస్తూ హెచ్ఐవీ, ఎస్టీఐల నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీపై సమాజంలో ఉన్న అపోహలు, వివక్షను తొలగించడంలో యువత చురుకైన పాత్ర పోషించాలన్నారు. అవగాహన సందేశాన్ని తమ కుటుంబాలు, స్నేహితులు, సమాజంలోని ఇతర వర్గాలకు చేరేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువ క్రీడాకారులు, అధికారులు, శారీరక విద్యా అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ , స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను నిర్వాహకులను అభినందించారు. జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారి డా. ఎన్. వసుంధర మాట్లాడుతూ, హెచ్ఐవీ సోకినంత మాత్రాన భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్ అందుబాటులో ఉన్నాయని, హెచ్ఐవీ నిర్ధారణ అయిన వారికి ఎఆర్టీ కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు అందిస్తున్నామని చెప్పారు. మందులను క్రమం తప్పకుండా వినియోగించడం ద్వారా వైరస్ నియంత్రణలో ఉండి ఆరోగ్యంగా జీవించవచ్చు న్నారు. హెచ్ఐవీ వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, కళాశాలల్లోని రెడ్ రిబ్బన్ క్లబ్‌లలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి డి.ఎం.ఎం. శేషగిరి, జిల్లా ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ అధికారి ఐ. శారద, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వినూత్న, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్/ఎన్‌సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవి తేజ, జిల్లా ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ బృందం సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లాలోని వ్యాయమ విద్యా అధ్యాపకులు, ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు, యువ ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొని 5కే రెడ్ రన్‌ను విజయవంతం చేశారు.

**5 కే రెడ్ రన్ విజేతలు :**

పురుషుల విభాగంలో

ప్రథమ బహుమతి -- కె. హేమంత్, ఏఎల్ అమీర్ కళాశాల.

ద్వితీయ బహుమతి -- కె. మణికంఠ, ప్రభుత్వ కళాశాల, రాజమహేంద్రవరం.

మహిళల విభాగం లో

ప్రథమ బహుమతి -- ఎం. అనుపమ, ఏఎల్ అమీర్ కళాశాల,

ద్వితీయ బహుమతి -- ఎస్. మహాలక్ష్మి, విజయదుర్గ కళాశాల లను పొందారు.

## నగరం లో ముగిసిన పోషణ్ మాహ్ పోషకాహార ప్రదర్శన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:** కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ( కాకినాడ) ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ్ మాహ్ సందర్భంగా నగరం లో నిర్వహించిన రెండ్రోజుల పోషకాహార ప్రదర్శన ముగింపు సభ బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు.?విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ, చిరుధాన్యాలను (మిల్లెట్స్) ఆహారంలో భాగం చేసుకోవాలని, సుపోషిత భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పోషకాహార స్టాళ్లను పరిశీలించి, ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది సేవలను అభినందిం చారు. ?ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీల విజేతలకు ఆయన బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం సోము వీర్రాజు ని సీబీసీ అధికారులు శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఈనెల 25 న జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఉద్యోగ మేళా

జిల్లా ఉపాధి అధికారి: సి హెచ్ శిరీష



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు కీర్తి చేకూరి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కలెక్టర్ వారి కార్యాలయం ప్రాంగణంలో సెప్టెంబర్ 25వ తేదీ (శుక్రవారం) ఉదయం 09:00 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లాఉపాధి అధికారిణి సి. హెచ్. శిరీష తెలిపారు.

ఈ మేళాలో 15 ప్రముఖ కంపెనీలు మిరకల్ సాఫ్ట్వేర్ ,రమాదేవి సూపర్ స్పెషలిటీ హాస్పిటల్, రాంచయిత్ టెక్నాలజీస్, ఎన్తంత్ర క్యూ, మైత్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్ , మైనింగ్ ఇండియా ప్రై లిమిట్ , రవళి స్పిన్నర్, ఇంజనీర్స్ అసోసియేషన్, టాటా ఎలక్ట్రానిక్స్ , ఠాగూర్ లేబోరాటేరీస్,

లార్సెన్ అండ్ టూర్బో, ప యనీర్ మహీంద్రా, జోయాలికస్ జ్యువలరీ, మెడ్ప్లస్, కియా ఇండియా హోటల్ రాయల్ పార్క్ కంపెనీలలో 1100 పోస్టల భర్తీకొరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని ఆమె తెలిపారు. పదవ తరగతి,ఇంటర్ నుండి ఏదైనా డిగ్రీ, ఎంబీబీఎస్, ఎండి, ఎమ్మెస్ ఫార్మసి, బిఎస్సి.నర్సింగ్, ఇంజనీరింగ్, ఎమ్ బి ఏ, పూర్తి చేసి అనుభవం ఉన్న లేదా ఆశక్తి గల 19 నుండి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని ఆమె వివరించారు.

మిరకల్ సాఫ్ట్వేర్ సొల్యూషన్ లార్సెన్ అండ్ టూర్బో కంపెనీ ప్రతినిధులు వ్రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు . ఈ కంపెనీలకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు పెన్ పేపర్స్ తమతోపాటు తెచ్చుకోవలెనన్నారు. మైత్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ మైనింగ్ ఇండియా ప్రై లిమిటెడ్ కంపెనీ వారికీ హిందీ స్పష్టంగా వచ్చిన అభ్యర్థులు కావాలెనన్నారు.

ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి, రెజ్యూమే, ఆధార్ సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సిద్ధంగా మేళాకు హాజరుకావాలని సూచించారు.

మరిన్ని వివరాలకు 8712655686,
8790118349,
8790117279 నంబర్లను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారి సి హెచ్ శిరీష తెలిపారు.

## బ్యాంకు నగర శాఖలో డాక్టరేట్ సురేష్ సబ్బానికి సత్కారం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**సిటో నిధి క్వాసీ బ్యాంకు సీఈఓ సురేష్ సబ్బానికి గౌరవ డాక్టరేట్ లభించిన సందర్భంగా సిటో నిధి క్వాసీ బ్యాంకు నగర శాఖలో బుధవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్తానిక బైపాస్ రోడ్డు లో ఉన్న సిటో నిధి క్వాసీ బ్యాంకు శాఖలో బ్యాంకు మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజ్మెంట్, సిబ్బంది, ఖాతాదారులు సురేష్ సబ్బానిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో సురేష్ సబ్బాని అందిస్తున్న సేవలు, సంస్థ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని పలువురు ఖాతాదారులు కొనియాడారు. ఈ గుర్తింపుతో ఆయన భవిష్యత్తులో సంస్థను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో అమరావతి బ్యాంక్ సీఈవో ఆదిస్వరూపపట్నాయక్, బ్యాంకు మేనేజ్మెంట్ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు

## సేవా సంకల్ప్ చిత్రాలేఖనం పోటీలలో పాల్గొన్న 200 మంది విద్యార్థులు.




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. సెప్టెంబర్ 23:**భారతీయ జనతా పార్టీరాష్ట్ర పార్టీ పిలుపుమేరకు తాడేపల్లిగూడెం తేతలి సత్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ హై స్కూల్ లో పిఎంశ్రీ సేవ సంకల్ప అభియాన్ చిత్ర లేఖనం పోటీలునిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 200 విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధాన ఉపాధ్యాయులు ఏం. సత్యనారాయణ పర్యవేక్షణ లో బుధవారం నిర్వహించారు., విద్యార్థులకు చిత్రాలేఖనం పోటీల కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈతకోట భీమశంకరరావు (తాతాజీ),రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి , పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు రామగాని సత్యనారాయణ, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మారిసెట్టి నరసింహమూర్తి, మహిళా మోర్చా అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి తుట్టగుంట కృష్ణకుమారి,పట్టణ యువమోర్చా అధ్యక్షులు కంచర్ల రాజా, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు, చిత్రలేఖం పరిశీలించి వారిని అభినందించారు. వారికి పుస్తకాలు, పెన్నులు బహుమతిగా ఇవ్వడం జరిగినది అన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఉంటే.





**బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసిన వడ్డి రఘురామ్ నాయుడు**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 23.** నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ప్రమాదాల్లో గాయపడిన వారిని, అకాల మరణాలతో విషాదంలో ఉన్న కుటుంబాలను పరామర్శిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు. పెంటపాడు మండలం బి.కొండేపాడు గ్రామానికి చెందిన అట్టి రమణ బాబు కాలుకు ప్రమాదం జరిగిందని తెలుసుకున్న వడ్డి రఘురామ్ నాయుడు ఆయనను పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే విషయాలను తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పెంటపాడు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన తిప్ప మల్లికార్జున రావు అకాల మరణం చెందడంతో విషయం తెలుసుకున్న వడ్డి రఘురామ్ నాయుడు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, మల్లికార్జున రావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం తాడేపల్లిగూడెం రూరల్ మండలం పుల్లయ్యగూడెం గ్రామానికి వెళ్లిన వడ్డి రఘురామ్ నాయుడు, అక్కడి ఎంపీటీసీ సభ్యులు మార్లపూడి సుబ్బారావు గారి కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు.

అదే గ్రామానికి చెందిన బాటిరెడ్డి శ్రీనును వడ్డి రఘురామ్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులు, గ్రామంలో నెలకొన్న సమస్యలు తదితర అంశాలపై వారితో మాట్లాడారు. తదుపరి బంగారుగూడెం గ్రామంలో పర్యటించిన వడ్డి రఘురామ్ నాయుడు పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. బంగారుగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బుర్ల కట్లయ్య గారి కుమారుడు శ్రీను చేతికి గాయం కావడంతో విషయం తెలుసుకున్న వడ్డి రఘురామ్ నాయుడు ఆయనను పరామర్శించారు. గాయం తీవ్రత, ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే గ్రామానికి చెందిన కంచర్ల వెంకటేష్ చేతికి గాయం కావడంతో ఆయనను కూడా వడ్డి రఘురామ్ నాయుడు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బంగారుగూడెం గ్రామానికి చెందిన గడిశెట్టి సత్యనారాయణ గారి తల్లి గడిశెట్టి రత్న మాణిక్యం అకాల మరణం చెందడంతో వారి కుటుంబాన్ని వడ్డి రఘురామ్ నాయుడు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, రత్న మాణిక్యం మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఈ విషాద సమయంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. అదేవిధంగా బంగారుగూడెం గ్రామానికి చెందిన కొల్లి సహదేవ్ అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కూడా వడ్డి రఘురామ్ నాయుడు పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతుడి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారి బాధలో తాము కూడా భాగస్వాములమని చెబుతూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఒకవైపు ప్రమాదాల్లో గాయపడిన వారిని పరామర్శిస్తూ, మరోవైపు అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు భరోసా కల్పిస్తూ, అకాల మరణాలతో విషాదంలో ఉన్న కుటుంబాలను స్వయంగా కలిసి ఓదార్చడం ద్వారా వడ్డి రఘురామ్ నాయుడు ఆయా కుటుంబాలకు తన వంతు సహకారం అందించారు.

నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ప్రజలతో ఆయన మమేకమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆపద సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండటం, బాధిత కుటుంబాలను స్వయంగా కలిసి పరామర్శించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పర్యటనలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం




- యువత భవిష్యత్తును కాపాడేందుకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహ కిషోర్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 23:**జిల్లాలో యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి ఎన్కోర్డ్ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత జీవితాలు ప్రభావితమవడంతో పాటు సమాజంలో నేర ప్రవృత్తి పెరిగే అవకాశం ఉందన్నారు. చిన్నారులపై లైంగిక దాడులు వంటి నేరాలకు మత్తు పదార్థాల వినియోగం ఒక కారణంగా మారుతున్న నేపథ్యంలో దీనిని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి అక్రమ రవాణా జరిగే కీలక మార్గాలను గుర్తించి పోలీస్, ఎక్సైజ్, అటవీ, రవాణా శాఖల సమన్వయంతో సమగ్ర తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాల నిఘాను విస్తృతం చేయడంతో పాటు అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. అనుమానిత విద్యార్థులను గుర్తించిన వెంటనే వారిపై ప్రతికూలంగా వ్యవహరించకుండా కౌన్సిలింగ్, అవసరమైన వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, ఉన్నత విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించి మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆదేశించారు. 15 నుంచి 25 సంవత్సరాల వయసు గల యువత, ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో చదువులు మధ్యలోనే నిలిపివేసిన విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. గత పదేళ్లలో చదువులు మధ్యలో నిలిపివేసిన విద్యార్థుల వివరాలను సేకరించి, వారి ప్రస్తుత పరిస్థితిపై అధ్యయనం చేసి, అవసరమైన అవగాహన, కౌన్సిలింగ్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. జైళ్లలో ఉన్న రిమాండ్ ఖైదీలు, మత్తు పదార్థాలకు బానిసైన వారికి మానసిక వైద్యులు, 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వంటి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రేరణాత్మక తరగతులు నిర్వహించాలని సూచించారు. వారు భవిష్యత్తులో తిరిగి నేరాల బాట పట్టకుండా వృత్తి నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కంటే మెరుగైన పర్యవేక్షణ, పడకల సౌకర్యం ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో డీ-అడిక్షన్ సేవలను బలోపేతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు మత్తు పదార్థాల వినియోగంపై ప్రాథమిక స్థాయి పరీక్షలు, గుర్తింపు, అవగాహన, కౌన్సిలింగ్ అంశాల్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల భద్రతను దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాల క్రయవిక్రయాలు, వినియోగంపై ప్రజలు తమ వివరాలు వెల్లడించకుండా సమాచారం అందించేందుకు ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో ప్రత్యేక సమాచార పెట్టెలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

**గ్రామీణ ప్రాంతాల్లోనూ డీ-అడిక్షన్ సేవలు విస్తరించాలి-ఎస్పీ డి.నరసింహ కిషోర్**

ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ డీ-అడిక్షన్ కేంద్రాల సేవలను నగర ప్రాంతాలకే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వారానికి ఒకసారి ప్రత్యేక కౌన్సిలింగ్, వైద్య శిబిరాలు నిర్వహిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంజినీరింగ్ కళాశాలల బస్సు డ్రైవర్లతో పాటు ఆటో డ్రైవర్లకు నెలకోసారి లేదా రెండు నెలలకోసారి మత్తు పదార్థాలు, మద్యం వినియోగంపై పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు ఈ పరీక్షలను నిర్వహించి సంబంధిత అధికారులకు నివేదికలు సమర్పించాలని తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీస్, ఎక్సైజ్, మున్సిపల్ శాఖల సమన్వయంతో చలించే సమగ్ర తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసి మత్తు పదార్థాల రవాణాపై నిరంతర నిఘా ఉంచాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనా, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేశ్వరరావు, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వై.శ్రీలత, జిల్లా లెప్రసీ, క్షయ నియంత్రణ అధికారి ఎన్.వసుంధర, ఎస్టీ సంక్షేమ అధికారి కేఎన్.జ్యోతి, జిల్లా విద్యాశాఖ అధికారి కే.వాసుదేవరావు, డీఎస్పీ శ్రీకాంత్తో పాటు పోలీస్, రైల్వే, విద్య, ఎక్సైజ్, ఎన్ఫోర్స్మెంట్, ఈగల్ బృందం, శక్తి బృందం, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, రవాణా, ఆర్టీసీ, పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, డిగ్రీ తదితర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం




**నూతన పోలవరం జిల్లాకు తొలి ఎస్పీగా కే. చక్రవర్తి బాధ్యతల స్వీకరణ**

**శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యం**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాకు తొలి జిల్లా పోలీసు సూపరింటెండెంట్గా కే. చక్రవర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన జిల్లాలో పోలీసు పరిపాలనా వ్యవస్థకు తొలి అధిపతిగా ఆయన బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు నేరాల నియంత్రణ, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. నూతన పోలవరం జిల్లాలో పోలీసు పరిపాలనా వ్యవస్థను పటిష్టంగా ఏర్పాటు చేయడం, వివిధ పోలీసు విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై వేగంగా స్పందించేలా పోలీసు యంత్రాంగాన్ని తీర్చిదిద్దడం తన ప్రాధాన్యతల్లో భాగమని తెలిపారు.

**లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

ముఖ్యంగా మారుమూల లోతట్టు మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు పోలీసు సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు పోలీసు యంత్రాంగం పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రజల్లో పోలీసులపై మరింత నమ్మకాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఆర్ట్స్ కళాశాల--మానవ హక్కుల మండలి మధ్య అవగాహన ఒప్పందం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ , సెప్టెంబర్ 23:**విద్యార్థుల్లో మానవ హక్కులు, రాజ్యాంగం, చట్టాలపై అవగాహన పెంపొందిం చేందుకు నగరంలోని 158 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి) , భారత మానవ హక్కుల పరిరక్షణ అవగాహన మండలి మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామచంద్ర ఆర్కే అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామచంద్ర మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానవ హక్కులు, రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపొందించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

మానవ హక్కుల మండలి అధ్యక్షులు సత్య గుమ్మాపు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమన్నారు. మహిళా భద్రత, బాలల హక్కులు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు, అవగాహన సదస్సులు, నమూనా పార్లమెంట్, చర్చాగోష్టులు నిర్వహించ నున్నట్లు చెప్పారు. విద్యార్థినులకు మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, గృహహింస నిరోధక చట్టం, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించనున్నారు. కళాశాలలో న్యాయ సహాయ కేంద్రం, మానవ హక్కుల విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. జర్నలిజం, న్యాయ విద్యార్థులకు మీడియా హక్కులు, సమాచార హక్కు చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై ప్రత్యేక శిక్షణతో పాటు జాతీయ, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలను సందర్శించే, శిక్షణ పొందే అవకాశాలు కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కే. సీతామహాలక్ష్మి, అధ్యాపకులు సయ్యద్ ఫరాహ్, ఎస్థూమ్, లక్ష్మీకుమారి, సీహెచ్ రామారావు, కేపీబీఎల్ సరోజ, ఏ. రామకృష్ణ, మానవ హక్కుల మండలి గౌరవ సలహాదారు కదలి వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులు డాక్టర్ జగదీష్ నాయుడు, ప్రధాన కార్యదర్శి బిందు చౌదరి, కోశాధికారి పిచ్చుక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూజీలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు కీ ప్లేయర్లకు రెస్ట్.. హెడ్ కోచ్ గంభీర్ హింట్




**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజీలాండ్ తో టెస్టు సిరీస్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది టీమిండియా. అందులో భాగంగా ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలుపెట్టింది. త్వరలో టీ20, వండే, టెస్టు సిరీస్ లు ఉన్న క్రమంలో.. టెస్టు సిరీస్ కే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు హెడ్ కోచ్ గంభీర్ చెప్పారు.

అందులో భాగంగా లిమిటెడ్ ఓవర్ల మ్యాచ్ నుంచి కీలక ప్లేయర్లకు రెస్టు ఇవ్వనున్నట్లు హింటిచ్చారు. టెస్టుకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పిన గంభీర్.. ప్లేయర్లకు రెస్టు ఇచ్చే అంశం న్యూజీలాండ్ సిరీస్ కేనని క్రీడావర్గాలు భావిస్తున్నాయి.

న్యూజీలాండ్ తో 12 మ్యాచ్ ల టూర్ కు ఇండియా సిద్ధమవుతోంది. మొత్తం ఐదు వండేలలో చివరి వండే ముగిసిన మూడు రోజులకే టెస్టు సిరీస్ ప్రారంభమవుతుంది. తొలి టెస్టు వెల్లింగ్టన్ లో నవంబర్ 19 నుంచి మొదలవుతుంది. దీంతో ప్లేయర్లపై వర్క్ లోడ్ పడకుండా.. టీ20, వండేల నుంచి రెస్టు ఇచ్చేందుకు ప్లాన్ చేస్తున్నట్లు హింట్ ఇచ్చారు గంభీర్.

**ప్రపంచపటాలు పరిశీలించండి**

టెస్టు సిరీస్ కు ముందు కీలక ప్లేయర్లైన శుబ్మన్ గిల్, కేఎల్ రాహుల్, యశస్వీ జైశ్వాల్, బుమ్రా, సిరాజ్, జడేజా, నితీష్ కుమార్ రెడ్డి లు టెస్టు సిరీస్ లో కీలకంగా కానున్నారు. చివరి వండే, మొదటి టెస్టుకు కేవలం రెండు రోజుల గ్యాప్ మాత్రమే ఉండటంతో టీ20, వండేల నుంచి వీరిని దూరంగా ఉంచనున్నట్లు గంభీర్ చెప్పిన మాటల ద్వారా తెలుస్తోంది. ఇండియాలో ఎంత మంది కొత్త వాళ్లు వస్తున్నా.. టెస్టు క్రికెట్ కే అధిక ప్రాధాన్యమని చెప్పడం గంభీర్ మాటల ద్వారా తెలుస్తోంది. ఇండియన్ ప్లేయర్లు దాదాపు అన్ని ఫార్మాట్లను మేనేజ్ చేయగల కెపాసిటీ ఉండటంతో.. అవసరమైన సమయంలో ప్లేయర్లకు బాధ్యతలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఇండియా ప్రధాన్య టెస్టు క్రికెట్. టీ20కి ఎంత క్రేజ్ ఉన్నప్పటికీ.. ఇండియా దృష్టి టెస్టులపైనే ఉంటుందన్నారు. టీ20లో బలమైన దేశం.. క్రికెట్ లో బలమైన దేశం కాలేదని.. టెస్టులో బలంగా ఉంటేనే అసలైన క్రికెట్ జట్టు అని చెప్పుకొచ్చారు.

# వాళ్లిద్దరూ ప్రపంచ కప్ గెలవాలని దేశం మొత్తం కోరుకుంటోంది: రింకూ సింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఆడాలని దేశం మొత్తం కోరుకుంటోందని టీమిండియా బ్యాటర్ రింకూ సింగ్ అన్నాడు. ఇద్దరూ దిగ్గజ ఆటగాళ్లని పేర్కొన్న అతడు.. 2027 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిస్తే అది దేశానికే కాకుండా కోహ్లీ, రోహిత్‌కు కూడా ఎంతో ప్రత్యేకమైన సందర్భమవుతుందని చెప్పాడు.

"విరాట్ భయ్యా, రోహిత్ భయ్యా ఇద్దరూ లెజెండ్స్. వాళ్లు ప్రపంచకప్‌లో ఆడాలని నా ఒక్కడి కోరిక కాదు.. దేశం మొత్తం కోరుకుంటోంది. వాళ్లు జట్టులో ఉండి భారత్‌ను ప్రపంచకప్ విజేతగా నిలిపితే ఎంతో గొప్పగా ఉంటుంది. అది వాళ్లకు చివరి ప్రపంచకప్ కావచ్చేమో. 2011 తర్వాత భారత్ వన్డే ప్రపంచకప్ గెలవలేదు. అందుకే వాళ్లిద్దరూ జట్టుతో ఉండి ట్రోఫీ గెలిస్తే ఎంతో ప్రత్యేకం" అని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రింకూ చెప్పాడు.

ఐపీఎల్ 2023లో గుజరాత్ టైటాన్స్‌పై వరుసగా ఐదు సిక్సర్లు బాదడంతో రింకూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే తనను కేవలం ఆ ఐదు సిక్సర్లతోనే గుర్తించకూడదని అతడు అంటున్నాడు. భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడంలో భాగస్వామి కావడమే ప్రస్తుతం తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడుతూ మరిన్ని ప్రపంచకప్ విజయాల్లో భాగం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ఇక తాను కేవలం టీ20 ఆటగాడిననే అభిప్రాయాన్ని కూడా రింకూ ఖండించాడు. దేశవాళీ క్రికెట్‌లో వన్డేలు, నాలుగు రోజుల మ్యాచుల్లోనూ ఆడుతున్నానని చెప్పాడు. భారత్ తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేయాలన్నది తన కల అని వెల్లడించాడు. ప్రస్తుతం భారత్ తరఫున ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్నా.. మూడు ఫార్మాట్లలోనూ రాణించగలనని విశ్వాసం వ్యక్తం చేశాడు. కెప్టెన్సీపై కూడా రింకూ స్పందించాడు. యూపీ లీగ్‌లో తన జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి టైటిల్ గెలిచానని గుర్తుచేశాడు. గత సీజన్‌లో ఐపీఎల్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నానని చెప్పాడు. అజింక్య రహానె, సూర్యకుమార్ యాదవ్ వంటి ఆటగాళ్ల నుంచి నాయకత్వ లక్షణాలు నేర్చుకుంటున్నానని తెలిపాడు. కెప్టెన్సీలో ఇంకా ఎదగాల్సి ఉందని పేర్కొన్నాడు.

# ఆసియా క్రీడల్లో మీరాబాయి చానుకు రజతం.. 28 ఏళ్ల భారత పతక నిరీక్షణకు తెర

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ వెయిట్?లిఫ్టర్ మీరాబాయి చాను చరిత్ర సృష్టించారు. జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల్లో వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఆమె రజత పతకం సాధించారు. మహిళల 49 కేజీల విభాగంలో పోటీపడ్డ ఆమె స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కేజీలతో కలిపి మొత్తం 198 కేజీల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. తద్వారా ఆసియా క్రీడల్లో పతకం సాధించాలనే తన చిరకాల వాంఛను నేరవేర్చుకున్నారు. మీరాబాయి చానుకు కూడా ఆసియా క్రీడల్లో ఇదే తొలి మెడల్. ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్, కామన్వెల్త్ గేమ్స్‌లో ఇప్పటికే పతకాలు సాధించిన మీరాబాయి చానుకు ఇప్పటివరకు ఆసియా క్రీడల పతకం ఒక్కటే లోటుగా ఉండేది. తాజా రజతంతో ఆమె తన పతకాల కలెక్షన్‌ను సంపూర్ణం చేసుకున్నారు. దీంతో పాటు వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో 28 ఏళ్ల భారత పతక నిరీక్షణకు మీరాబాయి చాను తెరదించారు. 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో భారత దిగ్గజ వెయిట్?లిఫ్టర్ కర్ణం మల్లేశ్వరి కాంస్య పతకం సాధించారు. ఆ తర్వాత వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఇండియాకు పతకం రాలేదు. తాజా విజయంతో 28 ఏళ్ల భారత పతక నిరీక్షణకు చాను తెరదించారు.



# 'జనవరి 12 విడుదల ' ఇంటర్వెల్, క్లైమాక్స్ ఇదే... అనిల్ రావిపూడి ఖాతాలో 10 వ హిట్ పక్కానా...



తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఇప్పటివరకు కనివిని ఎరుగని రీతిలో చాలామంది దర్శకులు సినిమాలను చేస్తూ ముందుకు సాగుతున్నారు. రాజమౌళి లాంటి దర్శకుడు వరుసగా 12 సక్సెస్ లతో ముందుకు దూసుకెళ్తుంటే అనిల్ రావిపూడి తొమ్మిది విజయాలను తన ఖాతాలో వేసుకొని పదో సక్సెస్ కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ప్రస్తుతం వెంకటేష్ – కళ్యాణ్ రామ్ లను హీరోలుగా పెట్టి 'జనవరి 12 విడుదల' అనే సినిమాని చేస్తున్నాడు. ఈ సినిమా 2027 సంక్రాంతి కానుకగా జనవరి 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇక ఈ సినిమాతో మరోసారి అనిల్ రావిపూడి కామెడీనే నమ్ముకొని ముందుకు సాగుతున్నాడు. అయితే ఈ సినిమాలో ఎమోషన్స్ ను సైతం బ్యాలెన్స్ చేస్తూ ప్రేక్షకులను కన్నీళ్లు పెట్టించడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నట్టుగా తెలుస్తుంది. ఇంటర్వెల్, క్లైమాక్స్ సన్నివేశాలు



ప్రేక్షకులందరిని కంటతడి పెట్టేలా డిజైన్ చేశారట. క్లైమాక్స్ అయితే భారీ ఎమోషనల్ సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్ కి కూడా పెద్దపీట వేసినట్టుగా తెలుస్తుంది... ఇంటర్వెల్ లో వెంకటేష్ కళ్యాణ్ రామ్ కు మధ్య ఒక పెద్ద గొడవ జరుగుతుందట. దాంతో వాళ్లిద్దరు విడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ సందర్భంలో సినిమా చూసే ప్రతి ప్రేక్షకుడికి ఆటోమేటిగ్గా కండ్లల్లో నుంచి కన్నీళ్ళు వస్తాయనే వార్తలైతే వస్తున్నాయి. ఇక క్లైమాక్స్ సీన్ లో హీరోలిద్దరు కలిసి ఫైట్ చేసినప్పటికి ప్రేక్షకుల్లో తెలియని ఒక గూస్ బంప్స్ వచ్చే సన్నివేశాలను కూడా ఇందులో పొందుపరిచినట్టుగా తెలుస్తుంది.

ఇక ఏదేమైనా కూడా కామెడీతో పాటు ఈసారి ఎమోషనల్ గా కూడా ప్రేక్షకులను కనెక్ట్ చేయాలనే ఉద్దేశ్యంతో అనిల్ రావిపూడి చాలా స్ట్రాంగ్ డిసిజన్ తీసుకున్నట్టుగా తెలుస్తుంది. ఈ సినిమాతో తన ఖాతాలో పదో విజయాన్ని వేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. ఇక ఈ సంవత్సరం 'మన శంకర్ ప్రసాద్' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఆయన వచ్చే ఏడాది 'జనవరి 12 విడుదల' సినిమాతో మరోసారి ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు... అనిల్ రావిపూడి పేరు చెబితే చాలు ప్రేక్షకులు ఆటోమేటిగ్గా థియేటర్ కి వచ్చేస్తారు. ముఖ్యంగా అనిల్ ఫ్యామిలీ ఆడియన్స్ ను టార్గెట్ చేసిన ప్రతిసారి సక్సెస్ లను సాధిస్తుండడం విశేషం... ఇప్పటికే స్టార్ హీరోలు సైతం అతనితో సినిమాలు చేయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్న కూడా ఆయనకున్న కమిట్ మెంట్ల ప్రకారం సినిమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. తమిళ్ స్టార్ హీరో అయిన విజయ్ సైతం 'జన నాయకుడు' సినిమాకి దర్శకుడిగా మొదట అనిల్ రావిపూడి నే అనుకున్నారట. అనిల్ ను పిలిపించుకొని మరి మూవీ చేయమని అడిగారట. కానీ అనిల్ కి ఇతర హీరోలతో ఉన్న కమిట్మెంట్స్ వల్ల నేను ఆ సినిమా చేయలేనని చెప్పాడట. అనిల్ రావిపూడి డైరెక్షన్లో బాలయ్య హీరోగా వచ్చిన 'భగవంత్ కేసరి' మూవీ రీమేక్ గా 'జన నాయకుడు' సినిమా తెరకెక్కిన విషయం మనకు తెలిసిందే. ఇక ప్రస్తుతం విజయ్ తమిళనాడు సీఎంగా పదవి బాధ్యతలను కొనసాగిస్తున్నాడు.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965